# బీభత్సశ్రీ

-భమిడిపాటి సోమయాజి

"ఏదో ఆటో ఆగింది, ఎవరొచ్చారో చూడండ్రా! పెళ్ళి పందిట్లో బాతాఖానీ కొడుతూ కూర్చోడం కాదు. పెళ్ళికి వచ్చిన బంధువులను సాదరంగా ఆహ్వానించి లోపలికి తీసుకురావాలి" అంది మర్యాదలు పాటించే పావని గారు.

"అలాగే" అంటూ ఆటో దగ్గరకి వెళ్ళిన విష్ణుగాడు ఒక్కరువు అరిచాడు. "మన సుబ్బుగాడు సతీసమేతంగా వచ్చేశాడు."

"ఇక ఫర్వాలేదు. వాడు వచ్చేస్తే బోల్డు పెళ్ళి పన్లు చేస్తాడు" అంది పావనిగారు.

"ఏం మామ్మా బాగున్నావా" అంటూ కాళ్ళకి దండం పెట్టాడు సుబ్బు.

"ఏమిట్రా శాంతి అత్తయ్యా, మీరూ కలిసి రాలేదా?" అంది పావనిగారు.

"ఏమిటి మామ్మా, మరచిపోయావా? శాంతి అత్తయ్య విజయవాడ నుంచి వస్తోంది" అని చెప్పాంకదా అన్నాడు విష్ణు.

సుబ్బు విష్ణు అన్నదమ్ముల పిల్లలు. కజిన్సయినా సొంత అన్నదమ్ముల్లా వుంటారు వాళ్ళు! తెలియని వాళ్ళు వీళ్ళ మాటల ధోరణి చూస్తే స్నేహితులనుకుంటారు. విష్ణు చెల్లెలి పెళ్ళిలో హడావిడి అంతా వీళ్ళదే.

"అవున్రా విష్ణూ! శాంతిశ్రీ గార్కి విజయవాడలో సన్మానంట కదా" అన్నాడు సుబ్బు.

"ఔన్రా, అందుకే ముంబాయి నుంచి ఏకాయేకీ విజయవాడ వెళ్ళింది. ఆవిడ ఎప్పట్నుంచో ఒక్క సన్మానం ఊడా జరగలేదని బాధపడుతోంది. ఈ సన్మానంతో ఆవిడ కోరిక తీరుతుంది. పాపం ఆవిడ కథ ఏ పత్రికలోనైనా పడితేచాలు ఒక ఎస్.టి.డి. కొడుతుంది. ఆ కథ చదివేదాకా ప్రాణం తీస్తుంది. ఈ కథలు మనచేత చదివించడంలో వున్న శ్రద్ధ ఆవిడ పిల్లల్ని చదివించ డంలో చూపిస్తే వాళ్ళు ఫస్ట్ ర్యాంక్‌లో వచ్చేవారు" అన్నాడు విష్ణు.

ఇంతలో శాంతి అత్తయ్య ఆటోలో దిగనే దిగింది. ఆవిడ్నిచూసిన సుబ్బు సంతోషంగా "పెద్దపన్నా అత్తయ్య వచ్చేసింది" అన్నాడు.

"వింటే చంపేస్తుంది జాగ్రత్తరా" అన్నాడు విష్ణు.

"ఆ! ఆవిడ దిన దిన ప్రవర్ధమానంగా లావు అవ్వచ్చుగాని మనం పెద్ద పన్నా అత్త అంతే తప్పా?" అన్నాడు సుబ్బు.

"ఏమత్తా కులాసా. ఆ చేతిమీద ఆ చేమంతి పూల దండేమిటి?" అని అమాయకంగా అడిగాడు సుబ్బు.

"ఏమిటో! ముంబాయిలోనే వుంటున్నాం. ఎప్పుడూ యింటికి రావు సరికదా కనీసం ఫోన్ కూడా చెయ్యవు. అసలు నిన్ను కూడా విజయవాడలో జరిగే నా సన్మాన సభకి తీసుకెడదామనుకున్నాను. నిన్నటి సన్మాన సభకి చాలామంది రైటర్స్ వచ్చారు. అబ్బ.. నా కథల్ని ఏం మెచ్చుకున్నార్రా. అసలు కథలు రాయడం నేర్పే స్కూలొకటి పెట్టమన్నారు వాళ్ళు. తర్వాత చూద్దాం అన్నాను నేను. ఈ చామంతి పూదండ ఒకటి మచ్చుకి తీసుకొచ్చాను. ఇంకా చాలా దండలు వేశారు. అసలు యిలా పూలదండతో పెళ్ళికి రావడం ఎంతో శుభంరా" అంది శాంతిశ్రీ అత్త.

అసలు ఆ 'శాంతిశ్రీ' అనే కలం పేరులోనే వుంది తెలియని ఆకర్షణ అన్నాడు సుబ్బు.

"అవున్రా, మీ మామయ్య కూడా అదే అంటారు"

"అత్తా! స్నానం చేసిన తర్వాత ఆ దండ ఒకసారి వేసుకుంటే మనమంతా ఒక గ్రూప్ ఫోటో దిగుదాం" అన్నాడు విష్ణు.

"ఏమిట్రా వెధవల్లారా, అత్తని ఆటపట్టిస్తున్నారా" అంది పావనిగారు.

"లేదు మామ్మా! నిజంగా ఒక ఫోగో దిగుతాం" అన్నారు మనవలు.

అత్త అటు వెళ్ళగా చూసి సుబ్బు అన్నాడు. "అందరూ కలిసి గ్రూప్ ఫోటో ఎలా కుదురుతుందిరా ఆవిడ అసలే పెద్ద పన్నా అత్త కదా. ఒక్కొక్క ఫోటోలో ఆవిడతో పాటు యిద్దరి కంటే పట్టం"

"సర్లేరా.. వెధవ జోక్స్ నువ్వూనూ! వెళ్ళి స్నానం చేసిరా. అత్తయ్య సన్మాన కథ విందాం" అన్నాడు విష్ణు.

"అది సరే! అసలు యీ దండ ఎక్కడైనా కొను క్కొచ్చిందేమోరా. అత్తయ్య కథలు రెండు మూడు చదివాను కాని నాకేం నచ్చలేదురా" అన్నాడు సుబ్బు.

"అదిగో వచ్చేస్తోంది, వింటే చంపేస్తుంది. వెళ్ళిపో స్నానానికి" అన్నాడు విష్ణు.

○ ○ ○

విష్ణు స్నానం చేసి వచ్చేసరికి చిన్నత్త కూడా దిగింది. పావనిగారు చెప్పిన ప్రకారం విడిదికి వెళ్ళి ఏర్పాట్లు చూడ్డం మొదలెట్టారు. శాంతి అత్త, చిన్నత్తా విడిది నుంచి వచ్చిన తర్వాత చిన్నత్త అంది– "పెళ్ళికొడుకు ముచ్చటగా వున్నాడు. డబల్ ఎమ్.ఎ.ట కదా! తెలుగూ, ఇంగ్లీషు లిటరేచర్స్. అందుకునే సరస్వతీదేవి ముఖంలో తాండవిస్తోంది."

శాంతిశ్రీ అత్త అంది. "ఇతన్ని ఎక్కడో చూసి నట్లుంది. ఈ అబ్బాయి అంతకు ముందు ముంబాయిలో పనిచేశాడేమో ఒకసారి కనుక్కోండ్రా" అంది.

తర్వాత విడిదికి వెళ్ళినప్పుడు వాకబుచేస్తే పెళ్ళి కొడుకు ముంబాయిలో పనిచేశాడనీ, అంధేరీలో వుండే వాడనీ తేలింది. ఇదే విషయం శాంతిశ్రీ అత్తయ్యతో చెప్పాడు విష్ణు.

అదీ అలా చెప్పు. ఈ కుర్రాడు ముంబాయిలో వుండేటప్పుడు కథలు రాసి నా దగ్గరకి తెచ్చేవాడు. బాగా రాద్దామని ఆసక్తి వుందిగాని తగిన శక్తిలేదతనికి. అక్కడకీ చాలా గైడెన్స్ యిచ్చాను. ఇతనిచేత రాయించగా రాయించగా ఒక్క కథ ఒక పత్రికలో, అది కూడా పెద్ద పాప్యులర్ పత్రిక కాదనుకో, వచ్చింది. ఆ కథ పేరు "లేనిపోని గొడవలు వద్దు. కావాలంటే వెళ్ళి ఫలానా కథ మీరు రాసారట కదా అని అడుగు" అంది శాంతిశ్రీ అత్త.

పెళ్ళి పెళ్ళికొడుకుని అడిగితే, "ఔను! మీకెలా తెలుసు" అని అడిగాడతను విష్ణుని.

ఆ ఏంలేదు మా అత్తయ్యగారు 'శాంతిశ్రీ' అని పెద్ద రచయిత్రి అన్నాడు విష్ణు.

పెళ్ళి టైముకి ఆ నోటా ఆ నోటా పెళ్ళికొడుకు రాసిన కథలు పెద్దపన్నా అత్త దిద్దింది అని అందరికీ తెలిసిపోయింది.

పెళ్ళికొడుక్కి తను కథలు రాద్దామని ప్రయత్నించిన రోజులు గుర్తుకొచ్చాయి. మీరు ఎమ్.ఎ. లిటరేచర్ అవ్వచ్చుగాని షార్ట్ స్టోరీ రాయడం కష్టమన్న శాంతిశ్రీ గారి మాటలు, ఆవిడ కొట్టిన పోజులు జ్ఞాపకం వచ్చాయి. పైగా ఆవిడ గైడెన్స్ తీసుకున్నట్టు పెళ్ళింట్లో అందరికీ తెలిసిందన్న వార్త విని బాధపడ్డాడు. "ఈవిడ యిచ్చిన గైడెన్స్ అసలేమాత్రం! పైగా అందరికీ చెప్పడం" అని పెళ్ళికొడుక్కి జ్ఞాపకం వచ్చింది.

వియ్యంకుడ్ని పిలిచి పెళ్ళికొడుకు ఆడపడచులు "మీ యింటి ఆడపడుచు శాంతిశ్రీ, ఆవిడే పెద్ద రచయిత్రిలా మా తమ్ముడికి గైడెన్స్ యిచ్చానని అందరికీ చెప్పడం బాగాలేదు" అని నిర్మొహమాటంగా చెప్పారు. అలిగి భోజనాలకి రాలేదు వాళ్ళు.

కన్యాదాతగారు తన చెల్లెల్ని పిలిచి, "ఏమిటే శాంతీ ఇది. నీ కథా రచన వలన సంసారం రచ్చకెక్కుతోంది. ఆ పెళ్ళివారు అలిగారు. ఎక్కడ విషయాలక్కడ వది లెయ్యాలిగాని, అందరికీ ఆ పెళ్ళికొడుకు రాసిన కథలు, నువ్వు దిద్దావని, నలుగురికీ ఎందుకు చెప్పావ్" అని మందలించారు.

"అదేమిటి అన్నయ్యా! నేనీ విషయం మహాఅయితే ఓ పదిమందికి చెప్పివుంటాను. అందరికీ తెలిస్తే నాదా బాధ్యత. నేనెళ్ళి సర్దుబాటు చేస్తానుండు"

పోను పోను ఆ "లేనిపోని గొడవలు" కథ వలన చాలా గొడవలయ్యాయి. ఆడపడుచులకు నేత చీరల బదులు పట్టుచీరలు, పెళ్ళికొడుక్కి మోటార్ సైకిల్ కొనివ్వడానికి ఒప్పుకున్నాడు కన్యాదాత. శాంతిశ్రీ కథల విషయంలో యిచ్చిన గైడెన్స్ మింజుమలె.

ఆవిధంగా పెళ్ళి చాలా ఘనంగా జరిగింది. ఈ పెద్ద పన్నా అత్తయ్య తెచ్చిన తంటా వలన, ఆవిడతో గ్రూప్ ఫోటో కేన్సిల్ చేశారు– సుబ్బు అండ్ విష్ణు. పైగా పేరు కూడా 'బీభత్సశ్రీ' అత్తయ్య అని మార్చేశారు. ■

---

ఒకే అద్దం - మూడు ప్రతిరూపాలు

నేల చీర మీద
చినుకు ముత్యాలు
అలంకారాలు (హైకూ)
నేల చీర మీద / చినుకు ముత్యాల
తళుకులు / పేరంటానికి! (నానీ)

ఎంత శోభ?

నేల చీర మీద
చినుకు ముత్యాలు
అలంకారాలుగా
అలరిస్తే..
ప్రకృతి అందాలే అందాలు
కళ్ళకు కనువిందులే!

-యలమర్తి అనూరాధ